క్లుప్తంగా

అర్బన్ సీఐగా ఏపీ మస్తాన్



మైదుకూరు : మైదుకూరు అర్బన్ సీఐగా ఏపీ మస్తాన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న బీవీ చలపతిని బదిలీ చేశారు. సీఐ మస్తాన్ నంద్యాల నుంచి ఇక్కడికి పదోన్నతిపై వచ్చారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడి ఎన్నిక



వనం నరసింహులు

గోపవరం : భారతీయ జనతా పార్టీ వైఎస్సార్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వనం నరసింహులును ఆ పార్టీ ఎంపిక చేసింది. గోపవరం మండలం రాచాయపేట గ్రామానికి చెందిన నరసింహులు గతంలో బీజేపీ నుంచి బద్వేలు అసెంబ్లీకి పోటీచేశారు. పార్టీకి మొదటి నుంచి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు నరసింహులు తెలిపారు. తన పదవికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శనగ విత్తనాల పంపిణీ

రాజుపాళెం : మండలంలోని రైతు భరోసా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శివరామ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మండలానికి 5080 క్వింటాళ్ల శనగలు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే కొంతమంది రైతులు శనగ విత్తనాల కోసం నమోదు చేసుకోగా, మరికొంతమంది డబ్బులు చెల్లించి విత్తనాలను తీసుకెళ్లారన్నారు. శనగ విత్తనం వేసే రైతులు మాత్రమే విత్తనాలను తీసుకెళ్లాలని, పంట వేయకుండా విత్తనాలు తీసుకెళ్తే వారిపై చర్యలుంటాయని చెప్పారు.

సాహిత్య పరిశోధనకు డాక్టరేట్

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా పనిచేస్తున్న వంకం భాస్కర్‌కు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. భాస్కర్ ఎస్కే యూనివర్సిటీ తెలుగు, తులనాత్మక సాహిత్య శాఖ విభాగాధిపతి ఆచార్య ఎస్‌ఆర్ సదాశివారెడ్డి పర్యవేక్షణలో 'ఆంధ్ర మహాభారతం – వర్ణ వ్యవస్థ' అనే అంశంపై చేసిన పరిశోధనకు యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది.

మృత్యుంజయ హోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న వేదపండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలను వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకరబాలాజీ, ఆలయ కమిటీ సభ్యులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరకే ఎరువుల విక్రయం

గోపవరం : రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించనున్నట్లు బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గోపవరం ఆర్బీకేని ఆయన తనిఖీ చేశారు. ఈ–పంట నమోదు, ఈకేవైసీని పరిశీలించారు. పంట సాగు చేసిన రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీ సీజన్‌లో ఆరుతడి పంటలైన చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఏడీఏ వెంట గోపవరం డీడీఓ విజయ కుమార్, వీఏఏ విజయ్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

మైదుకూరు : మండలంలోని గంజికుంట ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ఓబుళమ్మ అవగాహన కల్పించి మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ విజయలక్ష్మి, గంజికుంట సచివాలయ మహిళా పోలీసు లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలి

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలోని వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణకు కృషి చేయాలని వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ మహమ్మద్ ఉమర్‌కు ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి సూచించారు. వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌గా ఉమ్మర్ నియమితులైన సందర్భంగా శుక్రవారం ఉమ్మర్‌తో పాటు మాస్క్ కమిటీ అధ్యక్షుడు అల్లాబకాష్, పట్టణానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డిని మైనార్టీ నాయకులు కలిసి సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నేత కె.రమణారెడ్డి, సి.బాషా, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజారోగ్యానికి భద్రత



బద్వేల్ అర్బన్ : మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



కాశినాయన : వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు



ఖాజీపేట : వైద్య శిబిరంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బద్వేలు అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి భద్రత కల్పించారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని తిరువెంగళాపురం సచివాలయంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్నా గుర్తించి వారికి పూర్తిస్థాయిలో చికిత్స అందించడంతోపాటు మందులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బిజివేముల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చిన్న పోలిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షులు మల్లేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ క్రిష్ణారెడ్డి, మండల నాయకులు రాజగోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, మండల స్పెషలాఫీసర్ ఖాదర్‌బాషా, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఎంతో మేలు

బి.కోడూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని రామసముద్రం సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 265 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిలక్షుమ్మ, మండల తహసీల్దారు విద్యాసాగర్, వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయ్‌కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సంజీవరెడ్డి, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప వరం
– ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు గొప్ప వరమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని దేవాంగపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన వైద్యులు, చికిత్స పొందుతున్న ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ఇంటికే వైద్య సిబ్బంది వచ్చి అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, వార్డు సచివాలయ ఇన్‌చార్జిలు పోసా భాస్కర్, కాకర్ల నాగేశ్వరరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరం పరిశీలన

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్దశెట్టిపల్లె సచివాలయంలో శుక్రవారం తహసీల్దార్ నజీర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పరిశీలించారు. ఆయన డాక్టర్లు, వైద్య సిబ్బందితో మాట్లాడి సలహాలు, సూచనలు చేశారు. డాక్టర్లు శ్రీనివాస్, ఇలియారాణి, ఝాన్సీ, రవి, కంటి డాక్టర్ పవన్‌కుమార్ వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో వచ్చిన 373 మంది ప్రజలకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 5 మందిని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శాఖ డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, సర్పంచ్ మధుసూదన్, స్థానిక నాయకుడు మల్లేశం, పంచాయతీ కార్యదర్శి మునిరెడ్డి, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెచ్‌ఈఓ శోభారాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

రాజుపాళెం : మండలంలోని ఏరువపాళెం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు గుద్దేటి సుభాషిణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి రానున్నారన్నారు. ఈ శిబిరానికి ప్రత్యేక వైద్యులు వస్తారని, రోగులు వచ్చి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే జగనన్న సురక్షా లక్ష్యం
– ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : ప్రజల ఆరోగ్యంను పరిరక్షించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా గ్రామాల్లోనే వైద్య సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. భూమాయపల్లె పంచాయతీలోని ముత్తులూరుపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల వద్దకే పాలన తోపాటు వైద్యసేవలను తీసుకు వచ్చిన ఘనత సీయం జగన్‌దే అన్నారు. నియోజక వర్గ సమన్వయ కర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఎపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఎంపీటీసీ ముమ్మడి స్వప్న, మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, పుల్లూరు మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చాపాడులో..

చాపాడు : మండలంలోని మడూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పరిశీలించారు. చికిత్స తీసుకుంటున్న ప్రజలను వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి అర్హత కలిగిన వైద్యులు, వైద్య సిబ్బందిచే పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తారన్నారు. అనంతరం ఆయన పలువురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార విలువలతో కూడి పదార్థాలతో స్టాల్ నిర్వహించారు. పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించగా ఎమ్మెల్యే వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ నాగిరెడ్డి, మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు వినయ్‌కుమార్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సర్పంచ్ బాలఓబుళమ్మ, ఎంపీటీసీ సీమోన్, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, వైద్యాధికారులు, పాల్గొన్నారు.

నేడు పల్లవోలులో..

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. పల్లవోలు గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలందరూ ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బ్రహ్మంగారిమఠంలో..

బ్రహ్మంగారిమఠం : మండలంలోని ముడుమాల పంచాయతీలోని సిద్దయ్యమఠం దగ్గర శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని కేశాపురం. వెంకటాపురం, ముడుమాల గ్రామాల ప్రజలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. స్థానిక సర్పంచ్ శీలంలక్ష్మీదేవి, ఎంపీటీసీ శీలం పెంచలమ్మ, మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, ఈఓపీఆర్‌డీ జానికెనడా, వైద్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామగురివిరెడ్డి, పెద్దిరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దిరసవంచలో..

మండలంలోని దిరసవంచ పంచాయతీ పెద్దిరాజుపల్లె గ్రామంలో శనివారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పుల్లారెడ్డిపల్లెలో..

కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లె గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుదర్శన్ మాట్లాడుతూ శిబిరంలో 323 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 10 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సూదా రామకృష్ణారెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, ఎస్.లక్ష్మిరెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌బీ, వైద్యాధికారులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన మండలంలో

కాశినాయన : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో పాల్గొని వైద్య పరీక్షలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ మైథిలి కోరారు. శుక్రవారం మండలంలోని కోడిగుడ్లపాడు సచివాలయ ఆవణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, తహసీల్దారు రామచంద్రుడు, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు నిధులు



అధికారులతో కలసి ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు పరిధిలోని వాసవి సర్కిల్ నుంచి సినీ హబ్ మీదుగా రిలయన్స్ పెట్రోలు బంకు వరకు రోడ్డు విస్తరణకు సుమారు రూ.6కోట్లు నిధులు అవసరమవుతాయని సంబంధిత అధికారులు అంచనా వేసినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మున్సిపల్ కమిషనర్, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారులతో కలసి రోడ్డును పరిశీలించారు. దాదాపు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డును విస్తీర్ణాన్ని బట్టి వంద అడుగుల వరకు విస్తరించేందుకు పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డుకు రెండు వైపులా 15 అడుగుల చొప్పున రోడ్డును విస్తరించేందుకు సుమారు రూ.5కోట్లు నిధులు అవసరమవుతాయని ఆర్అండ్‌బీ అధికారులు చెప్పారన్నారు. అడ్డుగా ఉన్న 16 ట్రాన్స్‌ఫార్మర్లు, 173 విద్యుత్ స్తంభాలను మార్చేందుకు రూ.కోటి అవసరమవుతుందని తెలిపారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఆర్అండ్‌బీ ఈఈ నరసింహారెడ్డి, డీఈఈ లక్ష్మీనరసింహులు, ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులరెడ్డి, ఏడీఈ శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేశ్వరెడ్డి, మాజీ సర్పంచ్ రమణయ్య, ఆటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల అధ్యక్షుడు గుద్దేటి రాజారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరించాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాచమల్లు



పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోపాటు తాను కూడా మీపైనే ఎక్కువ నమ్మకం పెట్టుకుని పని చేస్తున్నానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు సంబంధించి శుక్రవారం సాయంత్రం స్థానిక శేగిరెడ్డి కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతోపాటు ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. గ్రామాల్లోని ముఖ్య నాయకులనే కన్వీనర్లుగా నియమించారని తెలిపారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలతోపాటు అగ్రవర్ణాలకు సైతం ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరు చేసిందన్నారు. ఎంతో ముఖ్యమైన చేనేత రంగాన్ని ఆదుకునేందుకు జగన్ వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ఏటా రూ.24వేలు చెల్లిస్తున్నారన్నారు. నాయీబ్రాహ్మణుల షాపులకు ఉచిత కరెంటు ఇస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వంలో లబ్ధి పొందారన్నారు. కన్వీనర్లు, గృహ సారథులకు రూ.10లక్షల ప్రమాద బీమాను జగనన్న అమలు చేస్తున్నారని, వలంటీర్ల కోసం తాను సొంతంగా డబ్బు చెల్లించి ప్రమాద బీమాను అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నానన్నారు. నియోజకవర్గంలో 54వేల మంది డ్వాక్రా మహిళలకు రూ.120 కోట్ల రుణమాఫీ చేశారన్నారు. గతంలో రైతులు ఎరువులు, విత్తనాలు తీసుకోవాలంటే పట్టణాల్లోని దుకాణాల వద్దకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిల్చొని పోలీసులచే లాఠీ దెబ్బలు తిన్న రోజులు ఉన్నాయన్నారు. అలాంటిది ప్రస్తుతం మన గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోనే ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ జ్యేష్టాది శారద, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, నంగనూరుపల్లె శంకర్ యాదవ్, చెన్నమరాజుపల్లె నక్క శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండి ఆత్మకూరు సుధాకర్‌రెడ్డి, బీఎస్‌ఆర్, మాజీ సర్పంచ్‌లు పల్లా లక్ష్మీనారాయణరెడ్డి, నందిమండలం వీరారెడ్డి, దేవీ ప్రసాద్‌రెడ్డి, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హుడికి సంక్షేమం అందించడమే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : రాష్ట్రంలో ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని బద్వేలు రోడ్డులో ఉన్న పద్మావతి కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే మళ్లీ ముఖ్యమంత్రి ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు క్లుప్తంగా వివరించాలన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్కా జూదర్లు అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక నడింపల్లె వీధిలో మట్కా జూదం ఆడుతున్న ముగ్గురిని టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ప్రాంతంలో మట్కా ఆడుతున్నారని సమాచారం రావడంతో సీఐ ఇబ్రహీం సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడిలో ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మట్కా స్లిప్పులతో పాటు రూ. 23,450 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

సన్మానం

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.కృష్ణారెడ్డిని శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి అంకితభావంతో పనిచేయడం వల్లే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిందన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్, జెడ్పీ చైర్మన్, డీఈఓ చేతుల మీదుగా అందుకున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9న జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ ఎంపికలు

బద్వేలు అర్బన్ : ఈ నెల 9న చెన్నూరు మండలం కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి కడప జిల్లాస్థాయి బాలబాలికల అండర్–14 టెన్నిస్‌బాల్ క్రికెట్ ఎంపికలు జరగనున్నట్లు టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యామల సుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాడిశెట్టి రవిశంకర్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులు 1-1-2009 తర్వాత జన్మించిన వారై ఉండాలని, ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16, 17, 18వ తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 9700676990, 9398635927 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

భగవంతుని నామార్చనే మోక్షానికి మార్గం

కడప కల్చరల్ : ప్రస్తుత కాలంలో భగవంతుని నామార్చనే మోక్షానికి మార్గమని ఆధ్యాత్మిక వేత్త త్రిదండి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి అన్నారు. ధార్మిక పర్యటనలో భాగంగా శుక్రవారం కడప లోని శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం వద్ద గల వాసవీ భవన్‌లో విడిది చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆయన మాట్లాడుతూ ధార్మిక గుణసంపన్నత కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా మన దేశానికి గౌరవనీయమైన స్థానం లభించిందన్నారు. ఇక్కడి ఆధ్యాత్మిక చింతన, పూజా విధానం, ధార్మిక జీవనం తదితర అంశాలు ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజలను ఎంతో ఆకర్షిస్తున్నాయని, అందుకే వారు తరుచూ మన దేశానికి వచ్చి ధార్మిక జీవనం గడుపుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్తా, పెరుమాళ్ల బాల సుధాకర్, పాలాది సుబ్రమణ్యం, వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్యా సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామమహేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీను, యాదాళ్ల రమణ, సుమన్, దేవతి శంకరయ్య, అర్చక సంఘం నాయకులు విజయ్‌భట్టర్, న్యాయవాది భారతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

గోపవరం : మండల అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ సమీక్ష నిర్వహించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు తదితర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించి అవసరమైన రోగులందరికి వైద్యశిబిరాల్లో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 10వ తేదీన బ్రాహ్మణపల్లెలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా డిమాండ్ నోటీసు ఇచ్చిన కూలీలకు పని కల్పించాలని సిబ్బందికి సూచించారు. బాల్యవివాహాల కట్టడికి ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. సమీక్షలో సచివాలయ సిబ్బంది, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

జాబ్ మేళా విజయవంతం




ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో అధ్యాపకులు

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైందని కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి శుక్రవారం జిల్లాలోని ఏదైనా ఒక నియోజకవర్గంలో ఇలాంటి జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని సూచించారు. ఈ జాబ్‌మేళాకు 13 సంస్థలు హాజరయ్యాయని తెలిపారు. మొత్తం 282 మంది అభ్యర్థులు హాజరవ్వగా 129 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని వివరించారు. ఈ కార్యక్రమంలో జేఈఓ దొనప్ప, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.నాగార్జున, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలిచిన ఏకైక సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



రైతులకు మోటారు, పంపుసెట్ మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే, పీడీ

మైదుకూరు : ఎన్నో ప్రభుత్వాలు, ఎందరో ముఖ్యమంత్రులు వచ్చినా రైతులకు అండగా నిలిచిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మైదుకూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నవరత్నాలులో భాగమైన వైఎస్సార్ జలకళ కింద బోరు బావులకు మంజూరైన మోటార్లు, పంపుసెట్లను ఆయన డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డితో కలసి లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు రైతులను మోసం చేశారని ఆరోపించారు. 2019 ఎన్నికల్లో రైతు భరోసా కింద రూ.12,500 ఆర్థిక సాయం చేస్తామని వైఎస్ జగన్ రైతులకు హామీ ఇచ్చి చెప్పిన మాట ప్రకారం ఐదేళ్లపాటు ఏడాదికి రూ.12,500కు బదులు రూ.13,500 ఇస్తున్నారన్నారు. మైదుకూరు ప్రాంతంలో ఓవర్ లోడ్ తగ్గించేందుకు గురువారం ముక్కొండ వద్ద సబ్ స్టేషన్‌ను ప్రారంభించామని, కూడలి వద్ద మరొకదానిని త్వరలోనే ప్రాంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పంట నష్టపరిహారం కింద మైదుకూరు నియోజకవర్గంలో రూ.80 కోట్లు రైతులకు అందిందని తెలిపారు. రైతులకు ఏ ప్రభుత్వంలో జరగనంత మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని కోరారు.

వైఎస్సార్ జలకళ అమలును వేగవంతం చేస్తాం – పీడీ

వైఎస్సార్ జలకళ పథకాన్ని వేగవంతం చేస్తామని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. ఐదు ఎకరాల లోపు, 10 ఎకరాల లోపు ఉన్న రైతులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఇప్పటికే జిల్లాలో వైఎస్సార్ జలకళ కింద 728 బోరుబావులు తవ్వించినట్లు వివరించారు. అందులో 659 బోరు బావులు విజయవంతమయ్యాయన్నారు. లబ్ధిదారులకు 206 బోర్లకు విద్యుత్ సౌకర్యం, 184 బోర్లకు మోటార్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. మైదుకూరు నియోజకవర్గంలో 183 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, 111 మందికి బోర్లు వేశామని, 108 బోర్లు విజయవంతం అయ్యాయన్నారు. 54 మందికి మోటార్లు పంపిణీ చేశామని, 45 బోర్లకు కరెంటు ఇచ్చామని, మిగిలిన వారికి త్వరలోనే ఇస్తామన్నారు. వైఎస్సార్ జలకళ పథకం 2.50 ఎకరాలు ఉన్న ప్రతి రైతుకు వర్తిస్తుందన్నారు. అదే విస్తీర్ణం ముగ్గురి పర్లతో ఉన్నా, వారికీ బోరు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని 18 బోరుబావులకు మంజూరైన రూ.48.42 లక్షలు విలువైన మోటార్లు, పంపుసెట్లను ఎమ్మెల్యే, డ్వామా పీడీ, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, డ్వామా ఏపీడీ మైథిలి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'తో సమస్యల పరిష్కారం

చాపాడు : ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని అల్లాడుపల్లె పంచాయతీ విజయనగరం, బీసీ కాలనీ, దాసరి కాలనీలలో, అల్లాడుపల్లె దేవాలయాలులలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. విజయనగరంలో సీసీ రోడ్లు నిర్మించాలని, చివరి వీధిలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని దళితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పంచాయతీ రాజ్ ఏఈ, ట్రాన్స్‌కో ఏఈలతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దళితవాడలో డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరారు. వీరభద్రస్వామి దేవస్థానానికి రథం మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు పూజారులు వినతి పత్రం అందించారు. ఇప్పటికే ఈ విషయం ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో నిధులు మంజూరవుతాయని ఎమ్మెల్యే పూజారులకు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అల్లాడుపల్లెలో..

అల్లాడుపల్లెలో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు.